క్లుప్తంగా

ప్రతి నెలా గర్భిణులకు వైద్య పరీక్షలు

మల్దకల్: ప్రతి నెలా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తునట్లు డాక్టర్ స్వరూపరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ



అయిజ: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 25 ,26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగం పోటీల్లో అయిజ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి వివిధ మెడల్స్‌కు ఎంపికయ్యారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మాస్టర్ శేక్షవలి ఆచారి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ సుధీర్‌కుమార్, ప్రదీప్ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమాస్తాకు ఆర్థికసాయం



అయిజ: పట్టణంలో కిరాణం దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్న రఘుకు తోటి గుమాస్తాలు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన రఘు కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వివిధ దుకాణాలలో పని చేస్తున్న తోటి మిత్రులు డబ్బులను పోగు చేసి ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా నిత్యావసర సరుకులను అందజేశారు.

న్యాయవాదికి ఎమ్మెల్యే నివాళి

శాంతినగర్: వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌కు చెందిన ప్రముఖ సివిల్ న్యాయవాది దేవినేని లక్ష్మణ్‌ప్రసాద్ ఆదివారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు న్యాయవాది భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ చిన్నిబాబు, కౌన్సిలర్ ఆంజనేయులు, దేవేంద్ర, కరుణాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డిలు ఉన్నారు.

ఎంపీడీఓకు వినతి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకులు ఈ నెల 3వ తేదీన వంట గ్యాస్‌పై నిరసనలో పాల్గొన్న పంచాయతీ కార్మికులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేశ్వర్ రెడ్డి, పిడుగు వెంకటేష్ పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉచిత వైద్య శిబిరం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ సంజీవని ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మానవపాడు వైద్యాధికారిణి రిజ్వానా తస్వీర్, సర్పంచు రేఖ, శ్రీలత, నాగరాజు, షబ్బీర్. తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగ చేసుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: శాంతియుతంగా హోలీ పండుగ చేసుకోవాలని ఇటిక్యాల ఎస్‌ఐ గోకారి, కోదండాపురం ఎస్‌ఐ వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని పేర్కొన్నారు. సంప్రదాయ రంగులు చల్లుకొని ఆనందంగా గడపాలని సూచించారు. బైక్ ర్యాలీలకు అనుమతి లేదని వివరించారు.

మొక్కల పెంపకంపై దృష్టి



మొక్కలకు నీరు పడుతున్న కూలీ



పాతపాలెంలో నర్సరీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

కేటీదొడ్డి: రాష్ట్ర వ్యాప్తంగా అడవుల విస్తీర్ణం, పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాలలో నర్సరీలలో మొక్కలు పెంచి సంరక్షించాలని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. దీంతో తొమ్మిదో విడత హరితహారానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహణ

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. కేటీదొడ్డి మండలంలోని మొత్తం 23 గ్రామ పంచాయతీల్లో నర్సరీ నిర్వహణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి పంచాయతీలో 10 వేల చొప్పున మొత్తం మండల వ్యాప్తంగా 2.30 లక్షల మొక్కలు పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాల ప్రాంగణాలు, బస్టాండ్, రోడ్లకు ఇరువైపులా రైతులకు ఉపయోగపడే అన్ని రకాల మొక్కలు నాటేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నర్సరీల్లో పండ్ల మొక్కలైన నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరితోపాటు పూల మొక్కలైన గులాబీ, మందార, గన్నేరు, కాగితపు పూల మొక్కలతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు జామ, మారేడు, వంటి మొక్కలను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో పాటు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఏపీఓ కుమార్ పరిశీలిస్తున్నారు.

కొనసాగుతున్న పనులు

మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొక్కల పెంపకం పనులతో ఒక్కో గ్రామంలో 40 మంది కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ప్రస్తుతం నర్సరీల్లో మట్టి పనులు, కవర్లో మట్టి నింపి మొక్కలను నాటడంలో కూలీలు నిమగ్నమయ్యారు.

ఉపాధి దొరుకుతుంది



గ్రామంలో నర్సరీల పనులు కొనసాగుతుండటంతో కూలీలకు ఉపాధి దొరుకుతుంది. నర్సరీ ఏర్పాటుతో పాటు మొక్కలకు నీటిని అందిస్తున్నాం. కవర్లలో మట్టి పోసేందుకు వెళ్తున్నాం.

–హనుమంతు, కూలీ, సోంపురం

పనులు పర్యవేక్షిస్తున్నాం



గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీ పనులు సాగుతున్నాయి. తొమ్మిదో విడత హరితహారం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్వాహకులకు సూచనలు అందిస్తున్నాం.

–కుమార్, ఏపీఓ, కేటీదొడ్డి

కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే అబ్రహం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రోడ్డు నుంచి స్కూల్ వెళ్లే దారి సక్రమంగా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందిస్తూ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలోని మహాత్మాజ్యోతి రావు పూలే గురుకుల బాలికల పాఠశాలను అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మిషన్ భగీరథ నీటిని ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ అధికారులను కోరారు. అనంతరం మిషన్ భగీరథ సీఈ చెన్నారెడ్డి పాఠశాలలోని నీటి వసతిని పరిశీలించారు.

ఆధ్యాత్మికతతో మంచి నడవడిక

మల్దకల్: ఆధ్యాత్మికతతో సన్మార్గం అలవడుతుందని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో భగవద్గీతపై సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక, త్రైతసిద్ధాంత గ్రంథాల సారాంశాన్ని వివరించారు. భగవద్గీత ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి ప్రజల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేష్, పరుషరాముడు, రామచందర్, కిశోర్, ధావన్, నాగవేణి, రేవతి, నర్సమ్మ, రాజేశ్వరి, సుజాత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

‘పది’ విద్యార్థులకు వీడ్కోలు



ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాలలో గడిపిన క్షణాలను, ఉపాధ్యాయుల సహకారం ఎప్పటికి మరిచిపోలేమని విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. ప్రణాళికా ప్రకారం చదువుతూ ముందుకు వెళ్లాలన్నారు. ఒత్తిడికి లోను కావొద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజ్‌భాషా, అన్వర్, మద్దిలేటి, జయరాముడు, జబిత, మాధవి, వెంకటేశ్వర్‌రెడ్డి, చారి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

కేటీదొడ్డి: అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జెడ్పీటీసీ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని పాగుంటలో సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంతర్గత డ్రెయినేజీల నిర్మాణానికి సహకరించాలని గ్రామస్తులు కోరగా వెంటనే ఆయన స్పందిస్తూ జెడ్పీటీసీ నిధుల నుంచి రూ. 2 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, కర్ణప్ప ఉన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రాజశేఖర్

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ సంఘం ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, బస్సు సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రైవేట్ కళాశాలలో ఫీజు ఒత్తిడి లేకుండా విద్యార్థులందరికి హాల్ టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అంజి, తరుణ్, వినోద్ తదితరులు ఉన్నారు.

పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి

రాజోళి: పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చేస్తున్న పాదయాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. 159 రోజులుకు 15,900 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం సిద్ధార్థ్ మాట్లాడుతూ తెలంగాణలో ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు కూడా అందడం లేదని ఆరోపించారు. ఉచిత విద్య, వైద్యం కోసం అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేశ్వర రాకేష్, పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిద్ధార్థ్

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను సీడీపీఓ సుజాత సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు పట్టికను పరిశీలించారు. చిన్నారుల సంఖ్య తక్కువగా ఉండటంతో అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఆస్మా, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.30 వేల విలువ చేసే విద్యా సామగ్రిని విద్యార్థులకు సోమవారం గద్వాలకు చెందిన భీమన్న తన కూతురు ప్రణతి పుట్టిన రోజు సందర్భంగా అందజేశారు. పదిలో 10 గ్రేడ్ సాధిస్తే రూ.10 వేలు ఇస్తానని నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరమ్ అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబులేష్, ఉపాధ్యాయులు శివశంకర్, పరుశరాం, నర్సింహులుగౌడు, నర్సింహులు, ఆశాబీ, రాజుసాగర్, గణేష్, రాఘవేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం వినియోగించుకోవాలి



గట్టు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు ధనలక్ష్మి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సరస్వతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్మిక నాయకుడి మృతి

గద్వాల రూరల్: కార్మిక సంఘం సీనియర్ నాయకుడు బాలగోపాల్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం ఆయన నివాసంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణలు బాధిత కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పాఠశాలల్లో హోలీ వేడుకలు



కేరింతలు కొడుతున్న చిన్నారులు

ధరూరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలను సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని లక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. హోలీ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో జ్ఞాపకశక్తి మెరుగు



మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

శాంతినగర్: ప్రతి రోజు ధ్యానం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ధ్యాన శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదుర్కొనే ఒత్తిళ్లను జయించాలంటే ధ్యానం ఒక్కటే మార్గమన్నారు. ధ్యానం చేసేవారు ఉత్సాహంగా ఉంటారని, అలాగే ద్వేషం, అసూయ దూరమవుతాయని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాకాహారం తీసుకోవాలని, మాంసాహారం మానాలని సూచించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మద్దిలేటి, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రాధ, సుభద్ర, శైలజ, స్వప్న, శోభిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠాలు బోధించిన వేళ



ఉండవెల్లిలోని తక్కశిల పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు

గద్వాల అర్బన్: మండలంలోని అనంతపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, వివిధ పాత్రలు పోషించారు. విద్యాశాఖ మంత్రిగా షాహిన్, కలెక్టర్‌గా చందు, అదనపు కలెక్టర్‌గా వరుణ్ కుమార్, డీఈఓగా రమేష్, తహసీల్దార్‌గా నాగమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించారు. అలాగే విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు హనుమంతు బహుమతులను అందజేశారు.



ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిగా ఆదిలక్ష్మి, డీఈఓగా గణేష్,, హెచ్‌ఎంగా దేవేందర్ గౌడ్‌లు వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను ఎన్నుకుందాం

గద్వాల న్యూటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, తపస్ బలపర్చిన ఏవీఎన్ రెడ్డి గెలుపుతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని తపస్ రాష్ట్ర కార్య నిర్వహకులు నరేష్ అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ధరూర్ మండలంలోని పలు పాఠశాలల్లో ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, నాగరాజు, మహేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: ఉపాధ్యాయుల సమస్యలపై మండలిలో ప్రశ్నించేవారిని ఎన్నుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహకులు నరేష్ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థించారు. పాత పెన్షన్ విధానం, 317 జీఓ ద్వారా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో గళం విప్పుతారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, మహేందర్, వెంకటేష్, రవి, మోహన్, రాము, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనంతాపురం పాఠశాల వద్ద ..

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

ఉండవెల్లి: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బీసమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. మాన్యం భూములలో పంటల సాగు వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయడం లేదని దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్ రెడ్డి లేవనెత్తారు. కస్తూర్బా పాఠశాలలో తాగునీరు రాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని కలుగోట్ల సర్పంచు హురునిస్సా వివరించారు. అదేవిధంగా విద్యుత్, డ్రెయినేజీ, రెవెన్యూ తదితర సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీకి విన్నవించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని సురేఖ, సర్పంచులు లోకేశ్వర్ రెడ్డి, శేషన్ గౌడ్, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, దేవన్న పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు, అమరవాయి గ్రామాలలో సోమవారం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరవాయిలో 1295 మందికి పరీక్షలను నిర్వహించగా, 198 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. 176 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. చిన్నపోతులపాడులో 120 మందికి పరీక్షలు చేయగా 16 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేయగా 9 మంది రిఫర్ చేశారు.

శాంతినగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరి కళ్ల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటుందని వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ కరుణ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సోమవారం ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉచితంగా పరీక్షలతో పాటు అద్దాలు, అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తారని వివరించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆదర్శప్రాయుడు గడియారం రామకృష్ణ శర్మ

జోగుళాంబ శక్తిపీఠం: ఆదర్శప్రాయుడు గడియారం రామకృష్ణ శర్మ అని ప్రముఖ సాహితీ వేత్త, కవి, రచయిత ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి అన్నారు. సోమవారం అలంపూర్ గురుదేవ్ స్కూల్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత స్వర్గీయ గడియారం రామకృష్ణ శర్మ జయంతిని నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెట్ శ్రీవిద్య, ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి, సీనియర్ జర్నలిస్ట్ ఆశన్న, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గంటిపోగు రాజులు హాజరై రామకృష్ణ శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ రచనల ద్వారా అలంపూర్ ఆలయాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపుపొందాయని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో గత నెల 21న కారు టైరు పేలి ముందున్న ఆటోను ఢీ కొని నలుగురికి గాయాలైన సంఘటన విధితమే. ఆటోలో ప్రయాణిస్తున్న ఉషా, తల్లి లక్ష్మీబాయ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై సోమవారం ఉషా సోదరి జ్యోతిబాయ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.